
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 11 సెప్టెంబరు 2024






సంగారెడ్డికి చెందిన ఓ నడి వయసు మహిళను ఇటీవల గుంటూరు పోలీసులు గుర్తించి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు తీసుకువచ్చారు. వివరాలు సేకరించగా తెలంగాణ నుంచి ఒకరితో కలిసి ఆమె గుంటూరు వచ్చింది. అతడు కొన్ని రోజులు ఆమెతో కలిసి ఉండి, ఆ తర్వాత ఆమెకు చెప్పకుండా వదిలి వెళ్లిపోయాడు. దీంతో రోడ్డు పాలైన ఆమెను ఐసీడీఎస్ అధికారులు చేరదీసి స్వధార్‌లో ఆశ్రయం కల్పించారు.

పెళ్లికి అంగీకరించలేదని తాడేపల్లికి చెందిన ఓ యువతిపై ఓ ప్రేమోన్మాది బ్లేడుతో దాడి చేశాడు. తన ప్రేమను అంగీకరించలేదన్న కసితో ఆమెపై బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.

- బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామంలో ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లిన ఓ యువతిని కొందరు దుండగులు అత్యాచారం చేసి, అత్యంత కిరాతకంగా హత్య చేశారు.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చిన కొండ్రుపాడులో 13 ఏళ్ల బాలికపై దుండగులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత హత్య చేశారు.
- పల్నాడు జిల్లా క్రిస్టియన్‌పాలేనికి చెందిన 20 ఏళ్ల దివ్యాంగురాలిపై అదే ప్రాంతానికి చెందిన దళిత యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. రొంపిచర్ల మం డలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన ఓ వివాహితపై లైంగిక దాడి జరిగింది.
- పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం పీర్ల చావడిలో నిద్రపోతున్న మహిళను ఇద్దరు యువకులు హత్య చేశారు.

ఇలా చెప్పుకుంటూ పోతే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, ఆకృత్యాలకు అంతూపొంతూ లేకుండా పోతుంది. అత్యాచారం అనే మాటే అరుదుగా వినిపించే ఈ ప్రాంతంలో ఇప్పుడు సామూహిక అత్యాచారం అనే పదం పదేపదే వినిపిస్తోంది. సాధారణ కుటుంబాల్లో భయ ప్రకంపనలు సృష్టిస్తోంది. మొత్తం సమాజాన్నే ఆందోళనలోకి నెట్టేస్తోంది.

బయటకెళ్తే.. భయం



- ప్రమాదంలో మహిళా భద్రత
- ఆందోళనకర స్థాయిలో అనేక అకృత్యాలు
- పెరిగిపోతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు
- గంజాయి, మత్తు పదార్థాల ప్రభావంతోనే దారుణాలు

వేధింపులు, దాడులు, అత్యాచారాలు, హత్యాచారాలు, హత్యలతో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళలు, విద్యార్థినులు, యువతులు మళ్లీ ఇంటికి వచ్చే వరకు కుటుంబసభ్యులు భయం భయంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో చిన్నచిన్న ఘటనలకే పోలీసులు కఠిన చర్యలు తీసుకునే వారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పోలీసింగ్ అనేది లేకపోవడంతో అరాచకవాదుల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. మద్యానికి తోడు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సులభంగా అందుబాటులోకి రావడం.. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి అకృత్యాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతతకు నిలయమైన ప్రాంతాల్లో కూడా అనేక దారుణ ఘటనలు వెలుగుచూశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల బాపట్ల జిల్లా చీరాలలో అత్యంత పాశవికంగా జరిగిన యువతి అత్యాచారం హత్య ఘటనతో ఉలిక్కిపడిన ఉమ్మడి గుంటూరు జిల్లా, కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనతో మరింత కలవరం చెందింది. మహిళల రక్షణ అంశం చర్చకు వచ్చింది.

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంగా చెప్పుకుంటున్న ఈ కంప్యూటర్ యుగంలో కూడా మహిళకు రక్షణ లేకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆడబిడ్డ తిరిగి ఇంటికి వచ్చే వరకు కుటుంబసభ్యులు ఆందోళన చెందాల్సిన భయానక వాతావరణం నెలకొంది. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్య ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన ఐదేళ్లలో లెక్కకు మిక్కిలి మహిళలపై దౌర్జన్యాలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా సామూహిక అత్యాచారాలు, హత్యలు నమోదయ్యాయి. 2022లో ఉమ్మడి జిల్లాలో అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. పల్నాడు జిల్లా గురజాల రైల్వే స్టేషన్ సమీపంలో ఒడిశా మహిళపై గ్యాంగ్ రేప్, దుగ్గిరాల మండలం చిలువూరులో దళిత యువతి గ్యాంగ్‌రేప్, హత్య, బాపట్ల జిల్లా రేపల్లె రైల్వే స్టేషన్‌లో వలస కూలీ కుటుంబంపై దాడి, మహిళ గ్యాంగ్ రేప్ ఘటనలు కేవలం పదిహేను రోజుల వ్యవధిలో వెలుగుచూశాయి. అదే ఏడాది పల్నాడు జిల్లాలో ఆశ వర్కర్‌గా ఉన్న 46 ఏళ్ల గిరిజన మహిళపై ముగ్గురు అత్యాచారం చేశారు. మాజీ సీఎం ఇలాఖా తాడేపల్లిలో అంధ యువతిని గంజాయి మత్తులో దారుణంగా హత్య చేయడం, మరో ఘటనలో యువతిని గ్యాంగ్ రేప్ చేసి పారిపోవడం వంటి అనేక ఘటనలు గత ఐదేళ్లలో పెచ్చరిల్లి పోయాయి.

అడ్డగోలు మద్యం విధానం

గతంలో మద్యం షాపుల వద్దే మందుబాబులకు ఒక రూమ్ ఏర్పాటు చేసేవారు. వారు అక్కడే మద్యం తాగి ఇళ్లకు వెళ్లిపోయేవారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానం కారణంగా మందుబాబులు ఊర్లమీద పడ్డారు. మద్యం షాపుల్లో తాగే అవకాశం లేకపోవడంతో బహిరంగ స్థలాల్లో మద్యపానం సర్వసాధారణంగా మారింది. ఆ సమయంలో అటుగా వెళ్లే మహిళలపై వేధింపులకు పాల్పడడం, ఎదురు తిరిగిన వారిపై దాడి చేయడం మందుబాబులకు పరిపాటిగా మారింది. ఈ ఘటనలపై ఫిర్యాదులు నమోదైనా పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు.

విచ్చల విడిగా గంజాయి వ్యాప్తి

వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడిగా చలామణిలోకి వచ్చింది. మహిళలపై జరిగిన అఘాయిత్యాల్లో ఏ ఘటన చూసినా నిందితులు గంజాయి మత్తులో ఉండడం సాధారణ అంశంగా మారింది. హైస్కూలు స్థాయి పిల్లలకు కూడా గంజాయి అందుబాటులోకి వచ్చిందంటే గంజాయి వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్నారని వస్తున్న ఫిర్యాదులు ప్రతి రోజూ పదుల సంఖ్యలో వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ సవాలును స్వీకరించి, అరాచక మూకల ఆట కట్టించకపోతే ఆడబిడ్డల భద్రత మరింత ప్రమాదంలో పడే ప్రమాదం లేక పోలేదు.





కొన్ని ఘటనలే.. కేసుల వరకు..

స్త్రీ శిశు సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో గడిచిన ఎనిమిది నెలల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చిన్నారులు, విద్యార్థినులపై వేధింపుల కేసులు 50కి పైగా నమోదయ్యాయి. కిందటేడాది మూడు జిల్లాల్లో బాలికలకు సంబంధించి దాదాపు వంద, మహిళలపై వేధింపుల కేసులు 40 వరకు నమోదయ్యాయి. అయితే వాస్తవంలో వీటికి అనేక రెట్లు మహిళలు, విద్యార్థినులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి. అవి పోలీస్ స్టేషన్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరకూ రావడం లేదు.



పంట నష్టం.. 36,804.60 హెక్టార్లు

- నివేదికలు సిద్ధం చేసిన జిల్లా అధికారులు
- రేపు జిల్లాలో కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం పర్యటన

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జిల్లాలో నష్టాన్ని లెక్కించి నివేదికలు సిద్ధం చేశారు. ఆయా శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుని కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో 36,804.60 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు నివేదికలు రూపొందించారు. ఇందులో వ్యవసాయ పంటలు 33,210.60 హెక్టార్లు, ఉద్యాన పంటలు 3,594 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. ఏడుగురు చనిపోగా వారికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించేందుకు రూ.35 లక్షలను విడుదల చేయాలని కోరారు. పక్కా ఇళ్లు 21 దెబ్బతినగా వాటికి మరమ్మతుల కోసం రూ.25.20 లక్షల నిధులు అవసరమని నివేదించారు. 13 కచ్చా ఇళ్లకి రూ.15.60 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న 77 పక్కా ఇళ్లకు రూ.5.05 లక్షలు, 453 కచ్చా ఇళ్లకు రూ.12.12 లక్షలు అవసరమని నివేదిక రూపొందించారు. 287 పూరిళ్లకు రూ.22.96 లక్షలు అవసరమని లెక్కలు తేల్చారు. పశువులు, జీవాలు, పౌల్ట్రీలకు జరిగిన నష్టం విలువ రూ.86.25 లక్షల వరకు ఉంటుందని నివేదించారు. పశుగ్రాసం నీట మునగడంతో రూ.43 లక్షల 83 వేల 500 నష్టం వాటిల్లింది.

303.599 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

జిల్లాలో 303.559 కిలోమీటర్ల పొడవునా ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. 15 సీడీ వర్కులు, 18 చోట్ల గండ్లు, 4 ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. రహదారుల తాత్కాలిక మరమ్మతులకు రూ.16.09 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.142.70 కోట్లు అవసరమని నివేదించారు. పంచాయతీరాజ్‌కు చెందిన 128 రోడ్లు, భవనాలకు రూ.72.47 కోట్లు అవసరమని నివేదించారు. మున్సిపల్ కేంద్రాల్లో 42.93 కిలోమీటర్ల పొడవునా రోడ్లు, 10.2 కిలోమీటర్ల ఓపెన్ డ్రెయిన్లు, 2,449 వీధిలైట్లు, ఒక భవనం దెబ్బతినగా రూ.29.14 కోట్లు అవసరమని లెక్కించారు. మైనర్ ఇరిగేషన్ తాత్కాలిక మరమ్మతులకు రూ.2 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.5 లక్షలు అవసరమని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు కట్టడాలకు రూ.52.10 కోట్లు అవసరమని ఆ శాఖ నివేదించింది. మత్స్యకారుల వలలకి రూ.3 లక్షలు, చేనేత మగ్గాలకు రూ.58.76 లక్షల నష్టం వాటిల్లింది. డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రహరీ కూలడంతో రూ.45 వేల నష్టం జరిగింది. ఏపీసీపీడీసీఎల్‌కు రూ.74.60 లక్షల నష్టం జరిగింది.

రేపు కేంద్ర బృందం పర్యటన


కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం గురువారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నది. తొలుత ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వరద నష్టాన్ని కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించనున్నారు. అనంతరం పెదకాకాని వద్ద గుంటూరు ఛానల్‌కు పడిన గండ్లను పరిశీలించి వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లపాలెం, మంగళగిరి, తాడేపల్లి మండలం మహానాడు, తుళ్లూరు మండలం వెంకటపాలెం ప్రాంతాల్లో పర్యటించేలా కేంద్ర బృందం రూట్‌ప్లాన్‌ను జిల్లా అధికారులు రూపొందించారు.

రేపు లంక గ్రామాల్లో సీఎం పర్యటన

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరదల ధాటికి కకావికలమైన లంక గ్రామాల ప్రజల పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం మంగళవారం సాయంత్రానికి అధికారులకు అందింది. దీంతో సీఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చేపడుతుంది. సీఎం పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్‌పై బుధవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వరదలు ఉధృతంగా ఉన్న ఈ నెల మొదటి వారంలోనే సీఎం పర్యటన జరగాల్సి ఉండగా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వాయిదా పడింది.

క్వార్ట్జ్‌పై.. కన్ను

యథేచ్ఛగా తెల్లరాయి దందా



క్వార్ట్జ్ నిల్వలు

- ప్రభుత్వం మారినా అక్రమాలు కొనసాగింపు
- పల్నాడులో బరి తెగించిన అధికార పార్టీ నేతలు
- గత ఐదేళ్లు ప్రకృతి సంపదను దోచిన వైసీపీ నేతలు
- అదే బాటలో ప్రస్తుతం పయనిస్తున్న టీడీపీ నేతలు
- అక్రమార్కులకు సహకరిస్తున్న కొందరు అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

క్వార్ట్జ్ ఎంతో విలువైన ఖనిజం. మార్కెట్‌లో టన్ను క్వార్ట్జ్ ధర రూ.30 వేల నుంచి రూ.50 వేలవరకు ఉన్నట్లు సమాచారం ఉంది. ఈ వ్యాపారంలో లాభాలు అధికంగా ఉండటంతో అధికార పార్టీ నేతల కన్ను క్వార్ట్జ్‌పై పడింది. నకరికల్లు మండలంలో తెల్లరాయి నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయి. త్రిపురాపురం, నరసింగపాడు, అడ్డరోడ్డు ప్రాంతంలోని కొండల్లో, చేజర్ల ప్రాంతం లోని అటవీ ప్రాంతంలో క్వార్ట్జ్ ఖనిజ సంపద అధికంగా ఉంది. దీంతో నాటి వైసీపీ హయాం లో ఆ పార్టీ నేతలు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు క్వార్ట్జ్ తవ్వకంపై కన్నేశారు. పాలకులు మారినా జిల్లాలో పెద్దఎత్తున తెల్లరాయి దందా కొనసాగుతోంది. నకరికల్లు, కారంపూడి మండలాల్లోని కార్ట్జ్ వైసీపీ నేతలకు కాసులు కురిపించింది. నరసింగపాడు కొండపై క్వార్ట్జ్‌కు మార్కెట్‌లో గిరాకీ ఉండటంతో ఈ కొండను అక్రమార్కులు టార్గెట్ చేశారు. ప్రభుత్వం మారినా క్వార్ట్జ్ తవ్వకాలు ఆగలేదు. అక్రమార్కులు మాత్రం మారారు. అనుమతులు లేకుండానే అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు వారికి సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కారంపూడి మండలం పేట సన్నెగండ్ల, నకరికల్లు మండలం నరసింగపాడులోని కొండలపై వైసీపీ హయాంలో కొందరు నేతలు అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపారు. పెద్దఎత్తున తెల్లరాయిని విక్రయించి రూ.కోట్లు గడించారు. ఎన్నికల ముందు నరసింగపాడు కొండ నుంచి దాదాపు రూ.కోటి విలువైన ఖనిజం అమ్ముకున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు రంగప్రవేశం చేశారు. యథేచ్ఛగా క్వార్ట్జ్ అక్రమాలు కొనసాగిస్తున్నారు. టీడీపీ నాయకుడి కనుసన్నల్లో రాత్రి పగలు అన్న తేడా లేకుండా తెల్లరాయిని తవ్వుతున్నారు. ఇందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. రాయి నాణ్యతను పరిశీలించే వ్యక్తులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. తవ్విన తెల్లరాయిని ప్రాసెస్ చేసి గోతాల్లో తరలిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులను కాపలా ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంతానికి సామాన్యులు వెళ్లే పరిస్థితులు లేవు. ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి తవ్వకాలు సాగిస్తున్నారు. ప్రాసెస్ అనంతరం పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

అనుమతి గోరంత.. కొండంత తవ్వకాలు

నకరికల్లు మండలం లోని త్రిపురాపురం కొండపై కూడా క్వార్ట్జ్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ మైనింగ్ శాఖ ఇచ్చిన అనుమతులకు తవ్వకాలకు పొంతనలేదు. క్వార్ట్జ్ కోసం కొండంతా తవ్వేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అనుమతి గోరంత అయితే తవ్వకాలు కొండంత అన్న చందాన సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అనుమతి తీసుకున్న వ్యక్తులు మైనింగ్ శాఖకు రాయల్టీ నామమాత్రంగా చెల్లిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. అధికారులు త్రిపురాపురం కొండపై జరుగుతున్న క్వార్ట్జ్ తవ్వకాలపై దృష్టి సారించి తవ్వకాల తీరు.. చెల్లించిన రాయల్టీ లెక్కలు తీస్తే ప్రభుత్వ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. త్రిపురాపురం కొండపై తవ్వకాలకు అనుమతి ఉందని, నరసింగపాడు కొండకు మాత్రం లేదని మైనింగ్ శాఖ అధికారి తెలిపారు.



4 వరుసలు రూ.108 కోట్లు

- శంకర్‌విలాస్ వంతెన విస్తరణకు రంగం సిద్ధం
- భూసేకరణ బాధ్యత తీసుకుంటామని జీఎంసీ లేఖ
- వంతెన నిర్మాణంపై కేంద్ర మంత్రి పెమ్మసాని దృష్టి
- కేంద్రం నుంచి నిధుల విడుదలకు మార్గం సుగమమం

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి నడి మధ్యన దశాబ్దాల క్రితం నిర్మించి.. నేటి ట్రాఫిక్ అవసరాలను తీర్చలేకపోతున్న శంకర్ విలాస్ ఫ్లైవోవర్‌కు మోక్షం కలగనున్నది. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న శంకర్ విలాస్ వంతెన విస్తరణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గడిచిన రెండు, మూడు దశాబ్దాల్లో నగరం బాగా విస్తరించింది. దీంతో ఎప్పుడో నిర్మించిన శంకర్ విలాస్ వంతెన ప్రజల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోతోంది. ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ వంతెనను విస్తరించాలని దశాబ్దాలుగా ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే అవన్నీ ప్రతిపాదనల దశలో దాట లేదు. ఇరువైపులా నిర్మాణాలను తొలగించాల్సి ఉండడంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. కూటమి ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి, ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ వంతెనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ఎట్టకేలకు ఈ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న వంతెన స్థానంలో నాలుగు వరసల్లో రూ.108 కోట్లతో నిర్మాణంలో చేపట్టడానికి అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను పెమ్మసాని కేంద్ర ప్రభుత్వానికి పంపారు. వంతెన నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ, డ్రెయినేజీ, తాగునీటి పైపులైన్ల మార్పిడి బాధ్యతను కార్పొరేషన్ తీసుకుంది. దీనికి జీఎంసీ ఆమోదం తెలపడంతో భూ సేకరణ సమస్య కొలిక్కి వచ్చింది. ఈ క్రమంలో వంతెన నిర్మాణానికి కేంద్రం నుంచి నిధుల విడుదలకు మార్గం సుగమమైంది.


నిర్మాణం ఇలా..

శంకర్‌విలాస్ వంతెన నిర్మాణానికి సంబంధించి భూమి సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఇప్పటికే బోర్లు వేసి నివేదిక సిద్ధం చేశారు. ఏసీ కళాశాల నుంచి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ వరకు వంతెన నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. వంతెన నిర్మాణం కోసం 120 అడుగుల వెడల్పున స్థలం అవసరం కాగా ప్రస్తుతం 95 నుంచి 105 అడుగుల మేర జీఎంసీ స్థలం ఉంది. ఇక 7,350 చదరపు గజాల స్థలం అవసరమని అధికారులు అంచనా వేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న 121 నిర్మాణాల్లో కొన్ని పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా తొలగించాల్సి వస్తుంది. ఎడమవైపున 55, కుడివైపున 66 నిర్మాణాలు కోల్పోవాల్సి వస్తుందని, వాటికి టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామని జీఎంసీ అధికారులు చెబుతున్నారు.

తొలి సమీక్ష ట్రాఫిక్ సమస్యపైనే..

కూటమి తరపున గుంటూరు ఎంపీగా గెలుపొంది, కేంద్ర సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెమ్మసాని తన తొలి సమీక్షలోనే నగర ట్రాఫిక్‌పై దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యను నివారించడానికి పలు వంతెనల నిర్మాణాలపై జూన్‌లో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. శంకర్‌విలాస్ వంతెనతోపాటు శ్యామలానగర్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గుజ్జనగుండ్ల- పేరేచర్ల ఆర్వోబీ, సీతానగరం గేటు వంటి పలు అంశాలపై చర్చించి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. రెండు వారాల్లో డీపీఆర్‌లను సిద్ధం చేయించి వాటిని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు అందజేసి సమస్యను వివరించి హామీ పొందగలిగారు.

విరాళాల వెల్లువ



విజయవాడలో సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న అమరావతి రైతులు

6లో..

168 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



లారీలో లోడ్ చేసిన రేషన్ బియ్యం

తిమ్మాపురం(యడ్లపాడు), సెప్టెంబరు 10: యడ్లపాడు మండలం తిమ్మాపురంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పరిధిలోని విజయకాటన్ మిల్లు గోడౌన్‌లలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్టు ముందస్తు సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అప్పటికే గోడౌన్ నుంచి లారీలోకి ఎత్తి తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యంతో పాటు గోడౌన్‌లో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీలో లోడ్‌చేసిన 337 బ్యాగులలో 132 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు 36 క్వింటాళ్ల నూకలు ఉన్నట్లు తహసీల్దార్ విజయశ్రీ నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు తేల్చారు. మిల్లు గోడౌన్‌లోని బ్యాగుల్లో మరో 10 క్వింటాళ్ల వరకు ఉండవచ్చని అంచనా వేశారు. సొలస గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి విజయా కాటన్ మిల్లుకు చెందిన గోడౌన్లను లీజుకు తీసుకుని కేవీఆర్ ట్రేడర్స్ పేరుతో అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. గోడౌన్‌లో బియ్యం పాలిష్ చేసేందుకు, నూకలుగా మార్చడానికి యంత్రాలను కూడా ఏర్పాటు చేసుకున్నాడన్నారు. నిందితునిపై కేసు నమోదుచేసి బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

విలేకరులపై దౌర్జన్యం

సంఘటనా స్థలానికి వెళ్లిన విలేకరులతో అక్కడ సూపర్‌వైజర్‌గా ఉన్న సాయి తేజ వాగ్వాదానికి దిగాడు. తాను ప్రసాద్ బావమరిదిని అని, తన అనుమతి లేకుండా మిల్లులోకి ఎందుకు వచ్చారంటూ విలేకర్లపై మండిపడ్డాడు. ఫొటోలు తీయడానికి వీల్లేదు తక్షణమే ఇక్కడ నుంచి వెళ్లి పోవాలంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అధికారులు బియ్యం పట్టుకున్నారన్న సమాచారంతో వచ్చామని విలేకరులు గట్టిగా బదులు చెప్పడంతోపాటు సంఘటన జరిగినప్పుడు విలేకరులు వస్తారని వీఆర్వో చెప్పడంతో అతను వెనక్కి తగ్గాడు.

జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, గుంటూరు

ఆర్.సి.నెం. 159/ఏ1/2024 తేది : 10-9-2024

జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, గుంటూరు వారి ఆధీనములోని మిషన్ వాత్సల్య స్కీమ్ క్రింద బాలల పరిరక్షణ విభాగములో **సోషల్ వర్కర్ -1, కౌన్సిలర్-1, అవుట్ రీచ్ వర్కర్-1** మరియు బాలిక సదనములో **వంట మనిషి (స్త్రీలు మాత్రమే)-1, హెల్పర్ కమ్‌నైట్ వాచ్‌ఉమెన్ (స్త్రీలు మాత్రమే)-1, పి.టి. ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ -1 (స్త్రీలు మాత్రమే) (పార్ట్ టైం)** పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి. దరఖాస్తులు కార్యాలయ పనివేళలలో తేది : 11-09-2024 ఉదయం 10:30 గంటల నుండి తేది : 20-09-2024 సాయంత్రం 5:00 గంటల వరకు స్వీకరించబడును. వివరములు కొరకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. **(సెల్ నెంబర్లు : 7901597294 &7901597295)** మరియు పోస్టుల పూర్తి వివరముల కొరకు ఈ దిగువ తెలిపిన కార్యాలయమును సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- జిల్లా స్త్రీ & శిశు సంక్షేమ & సాధికారత అధికారి,
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ,
స్వశక్తి భవన్, కలెక్టర్ బంగ్లా రోడ్, గుంటూరు – 522 004

విపత్తుకు భారీగా విరాళాలు



చెక్కు అందజేస్తున్న కారుమంచి ప్రసాద్



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న పీవీఎస్ సంస్థల చైర్మన్ శేషయ్య



పవన్‌కు అంగీకార పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ప్రసాద్ సీడ్స్ చేయూత

గుంటూరు, సెప్టెంబరు 10: వరద బాధితులకు చేయూతనందించేందుకు ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రూ.50 లక్షల చెక్కును మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయం అందజేసినట్లు తెలిపారు.

అమరావతి రైతుల ఆధ్వర్యంలో..

తుళ్లూరు, సెప్టెంబరు 10: ఓ వైపు రాజధాని అమరావతి రైతులు వరద బాధితులకు ఆహారం అందజేస్తూనే, మరో వైపు సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఎస్.సవిత చేతుల మీదగా రూ.3.30 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. చంద్రబాబు వారిని అభినందించారు. రైతులు చిట్టిబాబు, అనిల్, శ్రీధర్, శ్రీనివాస్ సహా 29గ్రామాలకు చెందిన కొంతమంది పాల్గొన్నారు.

సర్పంచుల నెల వేతనం వితరణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరవ సర్పంచులు ఒక నెల గౌరవ వేతనాన్ని రూ 3,92,91,000 ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ఈ సాయానికి సంబంధించిన అంగీకార పత్రాన్ని ఆయనకు అందజేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి కృష్ణమోహన్, సభ్యులు నాగమణి ,అశోక్, శ్రీరామ్ మూర్తి, ఇంద్ర సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవీఎస్ సంస్థల విరాళం

మంగళగిరి, సెప్టెంబరు 10: బుడమేరు వరద ముంపు బాధితుల సహాయార్థం పీవీఎస్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ పాములపాటి వెంకట శేషయ్య రూ.10 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. విజయవాడ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు చెక్కును మంగళవారం అందజేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గుంటూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ...

గుంటూరు విద్య సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూలు అసోసియేషన్ గుంటూరు విభాగం రూ.2 లక్షలు, ఆక్స్ఫర్డ్, ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ స్కూల్ వారు రూ.5 లక్షలు చెక్కులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి మంగళవారం అందజేశారు. జిల్లా విద్యాశాఖ శైలజ, స్కూళ్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల వితరణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం స్థానిక డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తమవంతు వితరణ ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు రూ. 1.15లక్షలు, ఉపాధ్యాయులు రూ. 85వేలు మొత్తం రూ. 2లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. వెలగపూడిలోని సీఎం నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఈ మొత్తాన్ని స్కూల్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, ఆర్వీఆర్‌అండ్‌జేసీ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, కేఎల్‌పీ స్కూల్ ప్రిన్సిపల్ జి రత్తయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు కనపర్తి రూ. 2 లక్షల విరాళం

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు రూ. 2 లక్షల విరాళం అందజేశారు. భారీ వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ఆయన విజయవాడ కలక్టరేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామప్రసాద్, నాయకులు పఠాన్ అస్మతుల్లా, షేక్ ఖరీం పాల్గొన్నారు.



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న రాయపాటి గోపాలకృష్ణ, జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ కృష్ణప్రసాద్



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కనపర్తి

14వ మైలు సెంటర్‌లో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే శంకరరావు పర్యటనను అడ్డుకునేందుకు భారీగా చేరుకున్న టీడీపీ శ్రేణులు
- టీడీపీ వర్గీయుల దాడిలో వైసీపీ నాయకుని కారు ధ్వంసం



శంకరరావును అడ్డుకునేందుకు వైకుంఠపురంలో టీడీపీ శ్రేణులు

అమరావతి, సెప్టెంబరు 10: వరద ముంపు వలన దెబ్బతిన్న పంటలను, గృహాలను, బాధితులను పరామర్శించేందుకు మంగళవారం వస్తున్నానని పెదకూరపాడు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వరద సాయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాదిరిగానే రాజకీయం చేయడానికి వస్తున్నాడని ఆగ్రహంతో శంకరరావు పర్యటనను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు వందలాదిగా వైకుంఠపురం, లేమల్లె గ్రామంలోని 14వ మైలు సెంటర్ వద్దకు చేరుకుని శంకరరావు ఏమార్గంలో వచ్చినా అడ్డుకుని గోబ్యాక్ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. తమ నాయకుడు వస్తున్నాడని వైసీపీ శ్రేణులు కూడా లేమల్లె గ్రామంలో ఉండి ఆయన రాకకోసం ఎదురు చూస్తున్నారు. టీడీపీ శ్రేణులు అడ్డుకుంటారన్న సమాచారంతో శంకరరావు తన పర్యటన రద్దు చేసుకున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు లేమల్లె గ్రామం నుంచి వెళ్లిపోయారు. ఇంతలో లేమల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వాసు తన కారును తీసుకునేందుకు వస్తుండగా టీడీపీకి చెందిన కొందరు నీవు ఎక్కడికిరా అంటూ అతని కారుపై దాడి చేసి అద్దాలు పగుల గొట్టారు. అప్పటికే బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు టీడీపీ వర్గీయులను వారించి పంపించి వేశారు. ఈ ఘటనతో లేమల్లెలో ఉద్రిక్తత వాతావరణం నెలకుంది.

ప్రజలను రెచ్చగొట్టేందుకే పర్యటన

వరద ముంపు జరిగి పది రోజులైన తరువాత ముంపు ప్రాంతాల్లో పర్యటన పేరుతో పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను సమీకరించడం ప్రజలను రెచ్చగొట్టేందుకే అని అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమి పాలైన శంకరరావు వంద రోజుల వరకు నియోజకవర్గానికి రాకుండా నేడు వరద సాకుతో వచ్చి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ప్రజలు ఆయన పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. శంకరరావు మూడు రాజధానులకు వ్యతిరేకంగా అమరావతి మాత్రమే రాజధాని అని ప్రకటిస్తేనే నియోజకవర్గంలోని అడుగుపెట్టేందుకు ప్రజలు అంగీకరిస్తామని హనుమంతరావు అన్నారు. టీడీపీ నాయకురాలు వేగుంట రాణి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతిగ్రామంలో పర్యటించి వరద బాధితులకు భరోసా కల్పించారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త నాయుడమ్మ స్ఫూర్తితో శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన అభివృద్ధి

- పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్
- ఎన్‌సీఎల్ సీఎండీ ప్రసన్నకుమార్‌కు నాయుడమ్మ పురస్కారం



నాయుడమ్మ పురస్కారంతో ప్రసన్నకుమార్, రాధిక దంపతులను సత్కరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 : దేశానికి చర్మ రంగంలో మంచి పేరు తెచ్చి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన దివంగత యలవర్తి నాయుడమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం నాయుడమ్మ స్మారక పురస్కారాన్ని నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు ప్రదానం చేశారు. యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాదబాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాంతం గర్వించదగ్గ వ్యక్తిగా నాయుడమ్మ ఉన్నత స్థానం చేరారని, శాస్త్రవేత్తలతో అవినాభావ సంబంధాన్ని నెలకొల్పారని చెప్పారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీని గ్రీన్ హైడ్రోజన్‌గా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారని ఇందులో భాగంగా సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేస్తామన్నారు నాయుడమ్మ ఆదర్శాలను ముందుకు తీసుకు వెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ ప్రాంతంలో ఆయన పేరు మీద మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి యువత ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తామన్నారు. అవార్డు గ్రహీత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, దేశంలో విద్యుత్ తలసరి వినియోగం 1350 కిలోవాట్స్ ఉందని, దానిని 2047కు 12500 కిలోవాట్స్‌కు చేర్చే లక్ష్యంగా ప్రధాని మోదీ వికాసిత్ భారత్‌కు పిలుపునిచ్చారని చెప్పారు. సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వంతో పాటు కార్పొరేషన్ పని చేస్తుందన్నారు. 2070 నాటికి కార్బన్ ఉద్గారాల విడుదల సున్న శాతం నమోదు అయ్యే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోలార్ పవర్ ఉత్పత్తికి వేసిన పునాది కారణంగా నేడు ఆ రంగంలో 1.50 లక్షల మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని దానిని 2030 నాటికి 1.50 గిగావాట్ల ఉత్పత్తికి చేర్చడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చెన్నై చర్మ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త స్వర్ణ వి కాంత్ మాట్లాడుతూ, చిన్న పల్లెటూరు నుంచి దేశంలోనే అత్యున్నత శాస్త్రవేత్తగా ఎదిగిన నాయుడమ్మ తమ సంస్థ చేసే ప్రతి పనిలోనూ స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తమ సంస్థకు పెద్ద చాలెంజ్ పెట్టిందని, అన్ని రకాల చర్మ ఉత్పత్తులు 50 శాతం పెంచి ఎగుమతి చేయాలని లక్ష్యం పెట్టిందన్నారు. ఇందుకు నాయుడమ్మ చూపిన బాటే తమను ముందుకు నడిపిస్తుందని, చర్మ పరిశోధన సంస్థ ఉత్పత్తుల్లో కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నిరోధించగలిగామన్నారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, యలవర్తి పవన్‌కుమార్ ప్రసంగించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

వరద బాధితులకు రూ. 25 లక్షలు : ఎమ్మెల్యే జీవీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు 25 లక్షల రూపాయల విరాళాన్ని మంగళవారం ప్రకటించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి చెక్కును అందజేస్తానని తెలిపారు. సర్వం కోల్పోయి అపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న వరద బాధితులను ఆదుకోవడానికి తన శివశక్తి బయో టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ, శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ. 25 లక్షలు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపేన అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

హౌరా - ఎస్‌ఎస్‌పీఎన్ వీక్లీ రైలు యశ్వంత్‌పూర్‌కు పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా వారంలో ఒక రోజు హౌరా - శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మధ్యన రాకపోకలు సాగిస్తున్న సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌ని యశ్వంత్‌పూర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ నెల 25వ తేదీన నంబరు. 22831 రైలు హౌరాలో మధ్యాహ్నం 2.50కి బయలుదేరి 26వ తేదీన ఉదయం 10.30కి గుంటూరుకు వస్తుంది. ఈ రైలు గురువారం అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు. 22832 రైలు యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 27వ తేదీన వేకువజామున 5 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.55కి గుంటూరు, 28వ తేదీన మధ్యాహ్నం 1.25కి హౌరా చేరుకొంటుంది. దీని వలన యశ్వంత్‌పూర్(బెంగళూరుకు సమీప స్టేషన్)కు కొత్తగా రైలు కనెక్టివిటీ గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది.

కొల్లం, సికింద్రాబాద్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓనం పండగ రద్దీ దృష్ట్యా ఈ నెల 13న సికింద్రాబాద్ - కొల్లం ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. నంబరు. 07119 సికింద్రాబాద్ - కొల్లం స్పెషల్ ఈ నెల 13న రాత్రి 5.30కి బయలుదేరి రాత్రి 7.59కి నడికుడి, 8.19కి పిడుగురాళ్ల, 8.44కి సత్తెనపల్లి, 10.15కి గుంటూరు, 14వ తేదీ రాత్రి 11.20కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07120 కొల్లం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 15న ఆదివారం వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.35కి గుంటూరు, 3.29కి సత్తెనపల్లి, 3.59కి పిడుగురాళ్ల, 4.29కి నడికుడి, సోమవారం ఉదయం 10.30కి సికింద్రాబాద్ చేరుకొంటుందని పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది శిక్ష

మంగళగిరి, సెప్టెంబరు 10: చెక్కు బౌన్సు కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.5,50,000 కాంపెన్‌సేషన్ ఫిర్యాదుదారునికి చెల్లించాలంటూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన వడితే నరేష్ వద్ద కొల్లిపర నివాసి ప్రస్తుతం బాపట్ల సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో సబార్డినేట్‌గా పని చేస్తున్న తూమాటి పీటర్ రూ.4 లక్షలు కుటుంబ ఖర్చుల నిమిత్తం తీసుకుని అనంతరం 2021లో రూ.5,50,000లు చెల్లించే విధంగా చెక్కు ఇచ్చారు. ఫిర్యాది నరేష్ తన చెక్కును మంగళగిరి ఎస్‌బీఐలో వేయగా నగదు లేవని రావడంతో ఫిర్యాది చట్ట ప్రకారం పీటర్‌పై చర్యలు తీసుకుంటూ మంగళగిరి కోర్టులో ఎన్‌ఐ యాక్టు కింద కేసు దాఖలు చేశారు. ఈ కేసు ఇటీవల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం నిందితుడైన పీటర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5,50,000 కాంపెన్‌సేషన్ చెల్లించాలంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అప్పీలుకు నెల రోజుల గడువు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ వారిపై వైసీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ, శివ

బెల్లంకొండ, సెప్టెంబరు 10: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన జరిగింది. ఈ సంఘటనలో చంద్రాజుపాలెం టీడీపీ కార్యకర్తలు గుంజా శివ, రామకృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రాజుపాలెంలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ ఊరేగింపులో తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి విగ్రహాలను ఆపి డీజేలతో వైసీపీకి చెందిన పాటలను ఏర్పాటు చేస్తుండగా టీడీపీ కార్యకర్తలైన గుంజా శివ, డాక్టర్ రామకృష్ణ ప్రశ్నించటంతో వైసీపీ నాయకులు రెచ్చి పోయి ఇద్దరి టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. కర్రలతో, రాడ్లతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిరువురిని స్థానికులు వెంటనే సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైసీపీ చెందిన రామకోటిరెడ్డి, కోటేశ్వరరావు, వీరితో పాటు మరో పది మంది వైసీపీ యువకులు దాడిలో పాల్గొన్నట్టు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలి

టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఎస్‌ఐ రాజను కలసి విన్నవించారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసినప్పటికీ నోరు మెదపలేదనీ, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో కూడా కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారు గ్రామంలో తిరుగుతున్నప్పటికీ పోలీసులు ఇంతవరకు వారిని అదుపులోకి తీసుకోలేదన్నారు. టీడీపీ నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, మాజీ సర్పంచులు హనుమంతరావు నాయక్, హుస్సేన్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 10: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,09,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2210 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,09,248 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,51,238 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,78,905 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

41,540 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 33,828 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 41,540 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,575 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	16000	334	7500	14700
నెంబరు. 5	10000	15500	నెంబరు. 5	10800	14000
273	11000	13800	273	--	--
341	8000	16500	341	7500	16000
4884	--	--	4884	--	--
సూపర్ 10	10700	10700	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	18700	తేజ	8200	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	8600	14500	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5500	11500

పడవల కుట్ర వెనకున్న పెద్దలు దేశద్రోహులే..


దేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీని పడవలతో ఢీకొట్టించి లక్షలాది మంది ప్రజలను ముంచేయాలని చేసిన కుట్రలో వున్న పెద్దలంతా దేశద్రోహులేనని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ధ్వజమెత్తారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తూ, లక్షలాదిమంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న ఈ ప్రాజెక్టును ధ్వంసం చెయ్యటానికి కుట్రచేసిన వారిని దేశద్రోహులు కాక ఇంకేమనాలని డేగల మండిపడ్డారు. ఈ నెల 2న ప్రకాశం బ్యారేజీకి వరద వచ్చిన సమయంలో 5 భారీ పడవలను బ్యారేజీ మీదకు వదిలి నాశనం చేసేందుకు వైసీపీ కుట్రచేసిందని ఆరోపించారు. ప్రకాశం బ్యారేజీకి ప్రమాదం వాటిల్లితే కృష్ణ, గుంటూరు జిల్లాల పరిస్థితి ఊహించరానిదన్నారు. ఈ పడవ ప్రమాదంపై జగన్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని, ఆ పడవలకు వైసీపీ రంగులున్న విషయం వాస్తవంకాదా అని ప్రశ్నించారు. ప్రకాశం బ్యారేజిని ధ్వంసంచేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే కుట్రలో భాగంగానే ఈ పడవలను వదిలారని ఆరోపించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష తప్పదన్నారు.

వరద ప్రాంతాల్లో కొనసాగుతున్న విజ్ఞాన్ విద్యార్థుల సర్వే


సర్వే చేస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబర్ 10: విజయవాడలోని వరదప్రాంతాల్లో వరుసగా నాలుగో రోజు వరద సహాయక సర్వేలో విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన 300మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఐదు గ్రూపులుగా విజయవాడ నగరంలోని వాంబేకాలనీ రోడ్, శాంతినగర్, డీస్నీలాండ్ రోడ్, పైపుల్ రోడ్, అజిత్‌సింగ్ నగర్, అంబేద్కర్ ఇన్నర్ రింగ్‌రోడ్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, ఫైర్ స్టేషన్ రోడ్, సుందరయ్యనగర్, తోటవారి వీధి, సింగ్‌నగర్, వడ్డెరకాలనీ, పీఎన్టీనగర్ కాలనీలో ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలపై సర్వే నిర్వహించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో అప్డేట్ చేస్తున్నారన్నారు. సర్వేలో భాగంగా విద్యార్థులు ఆయా కాలనీల్లో సరైన సమయానికి ఆహారం, సౌకర్యాలు అమ్ముతున్నాయా లేదా అని పరిశీలించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్స్ అభినందించారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో ఉరుకు పటేల చిత్ర బృందం సందడి



చిత్ర బృందంతో కలిసి నృత్యం చేస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 10: యువతకు మంచి మార్గనిర్దేశం చూపే సందేశాత్మక చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఉరుకు పటేల చిత్రం విజయోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలను చిత్రబృందం సందర్శించి విద్యార్థులతో కలిసి విజయోత్సవ సంబరాలతో సందడి చేశారు. సమాజంపై సినిమా ప్రభావం అధికంగా చూపుతుందని, దానిని దృష్టిలో ఉంచుకొని చిత్ర దర్శక, నిర్మాతలు కుటుంబ కథనాంశాలతోపాటు యువతకు స్ఫూర్తినిచ్చే చిత్రాలను నిర్మించాలని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ సూచించారు. చిత్రం మంచివిజయం సాధించాలని కోరుతూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు తేజుస్ కంచెర్ల, ఖుష్బూ చౌదరి మాట్లాడుతూ పల్లెటూరి నేపథ్యంలో యువతకు మంచి సందేశాన్నిచ్చే కథాంశంతో సాగుతూ ఉత్సాహభరిత యాక్షన్, థ్రిల్లింగ్ సన్నివేశాలతో చిత్రీకరించిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందడం ఆనందంగా ఉందన్నారు. చిత్రబృందం కళాశాల విద్యార్థులతో కలిసి నృత్యాలు చేసి ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ కె రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో సంతాన లేమికి ప్రధాన కారణం.. పీసీవోడీ!

● గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన


డాక్టర్ షమ సుల్తానను సన్మానిస్తున్న అధ్యాపకులు

గుంటూరు(మెడికల్), సెప్టెంబరు 10: మహిళల్లో సంతాన లేమికి పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్ (పీసీవోడీ) ప్రధాన కారణంగా మారినట్లు ప్రముఖ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. మంగళవారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో, హిందీ ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పీసీవోడీపై జరిగిన సమావేశంలో విద్యార్థినులకు ఆమె అవగాహన కల్పించారు. ఊబకాయం, జంక్‌ఫుడ్, హార్మోన్లలో అసమానతల వంటి పలు కారణాల వల్ల యువతుల్లో పీసీవోడీ సమస్య పెరుగుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారమార్గాలను ఆమె వివరించారు. విద్యార్థినులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తానను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీ వేణుగోపాల్, ఉమెన్ డెవలప్‌మెంట్‌సెల్ కన్వీనర్ వీ బ్యూలారాణి, హిందీ విభాగం అధ్యాపకులు షేక్ బాజీ, డాక్టర్ ఎస్‌వీఎస్ గిరిజ, డాక్టర్ కే లక్ష్మమ్మ, సీహెచ్ అరుణ, షేక్ హసీనా, పీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఎరువుల పేరుతో బురిడీ.. రూ.13.68లక్షల నిల్వలు స్వాధీనం

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 10: గుంటూరు జిల్లాలోని రైతులను ఆర్గానిక్ ఎరువుల పేరుతో బురిడీ కొట్టిస్తున్న గుట్టురట్టయ్యింది. వివిధ రాష్ట్రాల నుంచి నకిలీ ఎరువులను నగరానికి తీసుకువస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తించారు. మంగళవారం నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ఎల్ పార్సిల్ సర్వీసులో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రూ.13.68లక్షల విలువైన 6వేల కిలోల ఎరువులను ఎటువంటి బిల్లులు, రాష్ట్రంలో అమ్ముకోవటానికి లైసెన్సు లేకుండా తెచ్చినట్లు గుర్తించారు. ఆర్గానిక్ ఎరువుల పేరిట వీటిని తెచ్చినట్లు విచారణలో తేలింది. అహుజా అనే పేరుతో డెలివరీకి సిద్ధం గా ఉంచగా మొత్తం ఎరువుల నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బాధ్యులపై ఎరువుల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. దాడుల్లో పట్టణ వ్యవసాయ అధికారులు ఓ సునీల్, బి గౌతమ్ ప్రసన్న, జిల్లా కార్యాలయం సహాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి బెయిల్ అవుట్‌కి అధిక ప్రాధాన్యం

● వరద సహాయక చర్యల పర్యవేక్షణ అధికారి కన్నబాబు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 10: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్‌కి అధికప్రాధాన్యతగా అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నారని వరద సహాయచర్యల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి కె.కన్నబాబు తెలిపారు. మంగళవారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉన్న 62వ డివిజన్ లోతట్టు ప్రాంతాల్లో జెట్టింగ్ ఇంజిన్ల ద్వారా నీటిని బెయిల్ అవుట్‌చేస్తున్న ప్రాంతాలను ప్రత్యేక అధికారి పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. స్థానిక పరిస్థితులకనుగుణంగా వరద సహాయచర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారులకు కన్నబాబు సూచించారు.

వరద ముంపు ప్రాంతాల్లో బ్యాంకు రుణాల రీషెడ్యూల్

● బ్యాంకర్లకు కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదముంపు ప్రాంతాల్లోని బాధితుల అన్నిరకాల బ్యాంకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన ఇటీవల వచ్చిన వరదలను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించటానికి ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ)సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీవర్షాలు కురిసి వరదనీరు రావటంతో 10 మండలాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. ముఖ్యంగా కొల్లిపర, తుళ్లూరు మండలాల్లో లంకగ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయన్నారు. జిల్లాలో 33,000 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరగటంతోపాటు, ఉద్యానపంటలు దెబ్బతిన్నాయని, పశువులు వరద నీటిలో కొట్టుకుపోవటం, చనిపోవటం జరిగిందన్నారు. చేనేత పరిశ్రమ ముడి పదార్థాలు పాడైపోయి మగ్గాలు దెబ్బతిన్నాయన్నారు. చేపల వలలకు నష్టం జరిగిందన్నారు. ముంపు ప్రాంతాల్లోని నివాసాల్లోకి వరద నీరు వచ్చి నాలుగురోజులు నిలిచివుండటం వల్ల పాక్షికంగా ఇళ్లు, ఇంటిలో సామాన్లు పాడైపోయాయన్నారు. చిరు, వీధి వ్యాపారుల వాహనాలు, ఆటోలు, కార్లు సైతం ముంపునకు కొట్టుకుపోవటంతోపాటు పాడైపోయాయన్నారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస, సహాయచర్యలు పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో బాధితులు వరదవలన పంటలకు, చిరు వ్యాపారాలకు, ఇతర అవసరాలకు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు చెల్లింపుల్లో ఇబ్బందులు పడాల్సివస్తుందని కొంత సమయం కావాలని కోరారన్నారు. జిల్లాలో వరద ముంపును ప్రకృతి వైపరీత్యంగా ప్రకటిస్తూ ప్రత్యేక డీసీసీ సమావేశం తీర్మానించిందన్నారు. అందువలన బాధితుల పంటరుణాలు, స్వల్పకాలిక రుణాలు, వివిధ పథకాల ద్వారా స్వయం సహాయక సంఘాలకు, ఎంఎస్ఎంఈలకు ఇచ్చిన రుణాలను ఆర్బీఐ జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి అదనపు వడ్డీ లేకుండా బ్యాంకులు రీషెడ్యూల్ చేయాలన్నారు. వరదబాధితులకు సంబంధించిన పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై, వాహనబీమా, ఇంటిరుణాలు తదితర క్లెయిమ్‌లను బ్యాంకర్లు సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా లీడ్‌బ్యాంక్ ఆర్ఎం జవహర్, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, వివిధ బ్యాంకుల ఎగ్జిక్యూటివ్స్, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు భారీగా నిత్యావసరాలు


ఎమ్మెల్యే గళ్లా మాధవికి నిత్యావసర సరుకులు అందించిన దాతలు

గుంటూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకోవటం కోసం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఇచ్చిన పిలుపునందుకుని దాతలు పెద్దసంఖ్యలో ముందుకువచ్చారు. నిత్యవసరాలు, దుప్పట్లు, చీరెలను దాతలు ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ దాతలు పెద్దసంఖ్యలో ముందుకు రావటం అభినందనీయమన్నారు. రూ.15లక్షల విలువైన నిత్యావసరాలను, దాదాపు 2000 కుటుంబాలకు అందేటట్లు, వీటిని కిట్లుగా తయారుచేసి బుధవారం విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. శివలీల, రత్న ఉప్పుటూరి శ్రీనివాస్‌లు 100 దుప్పట్లు, 100 చొప్పున చీరలు ఇవ్వగా, అనురాధ, స్వప్న, మౌలిక 100 చొప్పున దుప్పట్లు, శాకాంబరీ హైట్స్ నివాసులు 150 నిత్యావసరాల కిట్లు, ఆర్ఆర్ ఎస్టేట్ 100 నిత్యావసరాల కిట్లు, సుధాకర్‌రెడ్డి అండ్ ఫ్రెండ్ సర్కిల్ రూ.2లక్షల విలువైన మందులు, పెంట్యాల సీతమ్మ 20 రైస్‌బాగ్స్, 20 లీటర్ల ఆయిల్, 20 కేజీల పంచదార, 20 కేజీల చింతపండు, 22కేజీల కంది పప్పు, 20 కేజీల గోధుమపిండి, వనమా నరేంద్ర చిన్నపిల్లల చిరుతిండి పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.రాజేష్, ములక సత్యవాణిరెడ్డి, మాదాల శైలజ, ఉప్పుటూరి శ్రీనివాసరావు, రత్న, మానం పద్మశ్రీరామ్‌బాబు, నేపాక పద్మ, పేరం అనిత పాల్గొన్నారు. కాగా వరద ముంపు నుంచి ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ గణనాథుని ఆమె ప్రార్థించారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో జరుగుతున్న వేడుకల్లో ఆమె మంగళవారం పాల్గొన్నారు.కార్యక్రమంలో కూటమి నేతలు శ్రావణకుమారి, ఆళ్ళ శిరీష, కసుకుర్తి అరుణ, నంది సరస్వతి, జూపూడి మాధవి, సవరం రాజ్యలక్ష్మీ, నాగలక్ష్మి, సైరా భాను, విమల, సోమి ఉదయ్, బండారు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు సరుకులు పంపుతున్న సీతారామయ్య హైస్కూల్ యాజమాన్యం

సీతారామయ్య హైస్కూల్ యాజమాన్యం చేయూత

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 10: మైలవరం తుఫాను బాధితులకు సీతారామయ్య హైస్కూల్ యాజమాన్యం సరుకులు మంగళవారం పంపించింది. లక్ష్మీపురం మెయిన్‌రోడ్‌లోని హైస్కూల్ ఆధ్వర్యంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ నియోజకవర్గంలోని వరద బాధితులకు వంద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటి బండ్ల విష్ణువర్ధన్, కమిటీ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హను మంతరావు, పాలకవర్గసభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పూర్వ విద్యార్థులు, పీ సుధీర్, అబ్దుల్‌రజాక్, భాస్కర్, లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతిదేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ నాయకులు శ్రీనివాస్,నరేంద్ర

కృష్ణ ఫ్యాన్స్ రూ.2.50లక్షల చెక్కు...

గుంటూరు, సెప్టెంబరు 10: వరద బాధితులకు చేయూతనందించేందుకు సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు సీనియర్ అభిమానులు ముందుకొచ్చారు. భావినేని సురేష్ రూ.లక్ష, చిలుకూరి శ్రీనివాస్ రూ.50వేలు, మాదాల నరేంద్ర రూ.50వేలు, శిరిపురపు చంటి రూ.50వేలు మొత్తం రూ.2.50 లక్షల చెక్కులను మంగళవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు.

పోరాటస్ఫూర్తిని చాటిన నిప్పుకణిక ఐలమ్మ


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గళ్లా మాధవి

ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శనీయమని ఎమ్మెల్యే గళ్లామాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాటస్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక, వీరవనిత ఐలమ్మ అన్నారు. కార్యక్రమంలో నాగ మల్లేశ్వరావు, కిరణ్,పూర్ణ, లక్ష్మయ్య మల్లె ఈశ్వరావు, వేములకొండ శ్రీనివాస్, చంద్రగిరిబాబు, అంజయ్య, మురళి, కరీమున్, వీరయ్య, నాగరాజు, దళవాయి కిషోర్, మొవ్వ వేణు, గుర్రం ప్రసాద్‌పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం మహిళా సమాజానికే ఆదర్శం

గుంటూరు, సెప్టెంబరు 10: వీరవనిత చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం మహిళా సమాజానికే ఆదర్శమని సామాజిక న్యాయకేంద్రం కన్వీనర్ వైకె అన్నారు. మంగళవారం జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, బహుజన పొలిటికల్ సెంటర్ కన్వీనర్ గంటా ప్రభుదాస్, నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, వేల్పూరి నరసింహారావు, ముప్పన వెంకటేశ్వర్లు, ఎస్.మాల్యాద్రి, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తిగా బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

గుంటూరు, సెప్టెంబరు 10: తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన వీర వనిత చిట్యాల ఐలమ్మ పోరాటం స్ఫూర్తిగా సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏపీ రజక జనసేవాసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సభ కొత్తపేట యానాది కాలనీలో స్కూల్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ సభ్యుడు జీఆర్ భగత్ సింగ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సాదం సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి గుంటూరు శివయ్య, రజక జనసేవా సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి పెనమాక రమాదేవి, ముస్లిమ్స్ మహిళా సంఘం నాయకురాలు షేక్ సల్మా, తస్నీరు సాంబయ్య, వర్ధన్ యాదవ్, షేక్ సైదా తదితరులున్నారు.


ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైకె, నరసింహారావు, ప్రభుదాసు తదితరులు

రైతు ఆధార్...

● ప్రతి అన్నదాతకు ప్రత్యేక సంఖ్య కేటాయింపు
● డిజిటల్ కార్డుల జారీకి సన్నాహాలు
● సాగు వివరాలతో పాటు వ్యక్తిగత సమాచారం నిక్షిప్తం
● అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభం కానున్న ప్రక్రియ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 10: ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకు ప్రత్యేక కార్డులు జారీచేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయించి డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. వ్యవసాయరంగాన్ని డిజిటలైజ్ చేసే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయించి, కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లుచేసింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. రైతులకు ప్రత్యేక సంఖ్య ఆధారంగా కేటాయించే గుర్తింపుకార్డు ప్రాజెక్టును రాష్ట్రంలో అమలుచేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. రైతు ప్రయోజనాలు ముడిపడిన అంశం కావడంతో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వచ్చే ఏడాది మార్చి లోపు రైతుల వివరాలు సేకరించి, ఆ తదుపరి డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తారు. జిల్లాలో రూ.2లక్షల 56వేల మంది రైతులకు ప్రత్యేక ప్రయోజనం కలగనుంది.

వైసీపీ సైకోలను ఏపీ నుంచి తరిమికొట్టాలి: మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ సైకోలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, ఓటమిని జీర్ణించుకోలేని జగన్ అండ్ కో చివరకు జీవనాధారమైన ప్రకాశం బ్యారేజీనే కూల్చేయాలనే కుట్రకు తెరతీశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుల ఇనుప పడవలతో ప్రకాశం బ్యారేజీని ఢీకొని కూల్చే కుట్ర చేశారన్నారు. అదృష్టవశాత్తూ పెనుప్రమాదం తప్పిందన్నారు. ఇంతటి విధ్వంసానికి కారుకులైన వారిపై దేశద్రోహం కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం బ్యారేజీకి ప్రమాదం జరిగితే కొన్నివేల మంది ప్రాణాలు పోయేవన్నారు. వైసీపీ నేతలు నందిగం సురేష్, తలసీల రఘురాం అనుచరులకు చెందిన పడవలతోనే ఈ కుట్రకు పాల్పడ్డారనే విషయం స్పష్టమౌతుందన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయం దాడి ఘటనలో అరెస్టైన నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ బుధవారం గుంటూరు జిల్లా సబ్‌జైలుకు రావడం చూస్తుంటే ఉన్మాదులను ఎంతగా ప్రోత్సహిస్తున్నాడో అర్థమౌతుందన్నారు. ఇలాంటి వారిని సమాజం నుంచి వెలేయాలన్నారు. వరద బాధితులనువదిలేసి గజదొంగలకోసం జైలుయాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వంలో విలీనం చేయాలి

● శంకర్‌విలాస్ సెంటర్ వద్ద నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం సెయిల్‌లో విలీనంచేయాలని అఖిలభారత కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేశాయి. మంగళవారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని తగ్గించేలా ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా చేస్తుందని మండిపడ్డారు. ఒకవైపు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపుతామని చెప్తున్నా, బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ వైపే ముగ్గుచూపుతూ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజురోజుకు కుదిస్తూ, కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ద్వంద్వవైఖరి అవలంబిస్తే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరసనల్లో వామపక్ష నాయకులు అకిటి అరుణ్‌కుమార్, కే శ్రీనివాసరావు, వి.రాధాకృష్ణమూర్తి, దయా రమాదేవి, కె.అజయ్ కుమార్, కె.రంగారెడ్డి, మేడా హనుమంతురావు, రావుల అంజిబాబు, నాజర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు: డీఎంహెచ్‌వో

గుంటూరు(మెడికల్), సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా జిల్లాలో కలుషిత నీటిద్వారా ప్రబలే వ్యాధుల నివారణకు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ విజ్ఞప్తి చేశారు. కలుషిత నీటిద్వారా నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. తాజాగా వండిన ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలన్నారు. దోమల వల్ల కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యు, చికున్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఇంటిలోపల, బయట దోమలు లేకుండా, ఈగలు వాలకుండా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వర పీడితులు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారు స్థానికంగా ఉన్న ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించి తగిన చికిత్సలు పొందాలని ఆమె తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని డీఎంహెచ్‌వో కోరారు.

ఆనందబాబు మరిన్ని పదవులు అధిరోహించాలి: ఎమ్మెల్యే నసీర్


ఆనందబాబుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. ఆనందబాబు పుట్టిన రోజు సందర్భంగా గుంటూరులోని నివాసంలో ఆయనను కలిసి నసీర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శారదా కాలనీ, వేణుగోపాలరావు నగర్, మద్దిరాల కాలనీ, మొదలైన చోట్ల వినాయక విగ్రహాల ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, మహంకాళి నరసింహారావు, బాజీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుంటూరులో జగన్ ఓదార్పు యాత్ర ఎందుకోసం..

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జగన్ పర్యటన ఏ వరద బాధితులను ఓదార్చడం కోసమో.. ఏ పంట నష్టపోయిన రైతులను పరామర్శించడం కోసమో చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీలోని రౌడీలను, ప్రజాకంటకులను కలవడానికి రావడాన్ని కూడా ప్రజల కోసం వచ్చినట్టుగా బిల్డప్ ఇవ్వడానికి జగన్‌కు సిగ్గుండాలన్నారు. ఆంధ్రులకు జీవనాడైన కృష్ణానదిపై ఉన్న ప్రకాశం బ్యారేజీని ధ్వంసంచేయాలని ప్రయత్నించిన వారిని పరామర్శించటం దేనికి నిదర్శనమని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలు, వారి పార్టీ ఆఫీసులు, వ్యక్తులపై దాడిచేసిన వారిని ప్రజాస్వామ్య ఖూనీకోర్లు అంటారన్నారు. జగన్ వారిని పరామర్శించడానికి వస్తున్నాడా? అని ప్రశ్నించారు. వైసీపీ రౌడీమూకలను పరామర్శించడానికి జగన్ శేష జీవితం సరిపోతుందని ఎద్దేవా చేశారు.

రిటర్న్స్ దాఖలు చేసే సమయాన్ని పొడిగించాలి

● ఆదాయపు పన్ను అధికారికి విజ్ఞాపన


రాఘవులుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీపీసీఏ సభ్యులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10: ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలుచేసే సమయాన్ని పొడిగించాలని కోరుతూ ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ (ఏపీటీపీసీఏ) ఆ ధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని, ఆదాయపుపన్ను అధికారి రాఘవులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీటీపీసీఏ అధ్యక్ష, కార్యదర్శులు దామచర్ల శ్రీనివాసరావు, కే వీ కోటేశ్వరరావు మాట్లాడుతూ 2023-24 ఏడాదికి ఆదాయపు పన్ను దాఖలు చేయడానికి ఈ నెలఖారు వరకు సమయం ఉందని, ఈ సమయాన్ని నవంబరు మాసాంతం వరకు పెంచాలని కోరారు. వరదల కారణంగా దుకాణాలు, పరిశ్రమలు, వ్యక్తిగతంగా కూడా తీవ్రంగా నష్టపోయ్యాయని, ఈ దృష్టా సమయాన్ని పొడిగించాలని కోరారు. సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికై కృషి చేస్తానని ఆదాయపు పన్ను అధికారి రాఘవులు హామీ ఇచ్చినట్టు దామచర్ల తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో బీపీ కుమార్, వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్ట్స్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అమలులోకి వస్తుంది.

- ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

- బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.
- అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.
- అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: ● passed Class 10 from a local government school. ● passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And ● enrolled in a full-time graduate programme starting in 2024-25.

● Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. ● Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 23-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

● Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024
Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాలఅడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.



కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి

దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

- ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.
- చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.
- నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రాజ్, నాజర్ వంటి సీనియర్స్‌తో కలసి నటించడం వల్ల చాలా నేర్చుకున్నాను. దర్శకుడు అర్జున్ సాయి తన తొలి సినిమాకు ఇలాంటి గొప్పకథను ఎన్నుకోవడం, ఆయనకు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సపోర్ట్ ఇచ్చి సినిమాను విడుదల చేయడం హ్యాపీగా అనిపిస్తోంది.
- నా తొలి సినిమా 'ఎస్.ఎం.ఎస్.' చేస్తున్నప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అందుకే ఇన్నాళ్లూ విభిన్న పాత్రలు చేస్తూ వచ్చాను. అన్ని రకాల పాత్రలు చేయడమే నా గోల్



కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు

ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్య'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు అందర్నీ తెగ నవ్వించాయి. పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలో విడుదలై అందరినీ అలరిస్తోంది.









వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతే కాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చందేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.

మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంచైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి దిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం



మలయాళ హీరో టోవిన్ థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రందం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పీహెచ్ వర్కర్ల హాజరును పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

మస్టర్ కార్యాలయంలో కమిషనర్ శేషన్న తనిఖీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 10: పట్టణంలోని పురపాలక సంఘ 3వ డివిజన్ మస్టర్ కార్యాలయాన్ని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్ కార్మికుల హాజరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, పట్టణ పరిశుభ్రతపై కార్మికులకు పలు సూచనలు చేశారు.



ఆత్మహత్య నివారణ దినోత్సవ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సైని తదితరులు

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

● జేఎంజే ప్రిన్సిపాల్ డాక్టర్ సైనీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 10: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని, అప్పుడే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు రావని జేఎంజే ప్రిన్సిపాల్ డాక్టర్ సైనీ అన్నారు. స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్య నివారణా దినోత్సవ అవగాహన కార్యకరమాన్ని జిల్లా మానసిక ఆరోగ్య శాఖ, జిల్లా ప్రభుత్వ వైద్యశాల వారి సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైనీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శ్రావణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విపత్కర సమయంలో భావోద్వేగాలను సమతౌల్యం చేసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నించాలన్నారు. విజ్ఞాన్ లారా యూనివర్సిటీ సైకాలజీ విభాగం అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ మండల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆత్మహత్యలకు పురికొల్పే అంశాలు, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నవారి ప్రవర్తన, వారి విపరీత ధోరణి ముందస్తు సంకేతాలు, నివారణ చర్యల గురించి విద్యార్థినులకు వివరిచారు. కార్యక్రమంలో గిరిధర్, ఎన్‌సీడీ మేనేజర్, గుంటూరు డాక్టర్ పి.హేమలత, హోమ్‌సైన్స్ విభాగపతి కె శ్రావణి, స్టాఫ్‌నర్స్ చినబాలయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ పరిశీలన



హైస్కూల్‌లో పోలింగ్‌స్టేషన్ ఏర్పాటుకు వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తెనాలిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లకు అనువైన హైస్కూల్స్‌ను తహసీల్దార్ గోపాలకృష్ణ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల పట్టణంలోని టీజే కాలేజీలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉండేవి. అయితే ఆ కాలేజ్ వివిధ కారణాలతో మూసి వేయడంతో ఆ పోలింగ్ స్టేషన్లను భర్తీచేసేందుకు తెనాలిలో వివిధ స్కూల్స్‌ను ఆయన పరిశీలించారు. అందులో భాగంగా బాలికల ఉన్నతపాఠశాల, మరికొన్ని హైస్కూల్స్‌కు వెళ్లి అక్కడ సౌకర్యాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగలకుదురులో ముంపు తొలగింపునకు చర్యలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని అంగలకుదురు శివారు కాలనీ వర్షపు నీటితో నిండిఉంది. విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, తహసీల్దార్ గోపాలకృష్ణలు ఆ ప్రాంతాలన్ని పరిశీలించి తక్షణచర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో నీటిని ఇంజన్ల సాయంతో బయటకు పంపడంతోపాటు జేసీబీతో కాలువ మరమ్మతులు చేపట్టారు. దీంతో వర్షపునీరు బయటకు వెళ్లడంతో పారిశుధ్య కార్మికులతో సురక్షిత చర్యలు చేపట్టారు. తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేసిన తహసీల్దార్ గోపాలకృష్ణ, ఉపసర్పంచ్ నాగభూషణానికి ఆ ప్రాంత నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు.



కాలనీలో నీటిని ఇంజన్లసాయంతో బయటకు పంపుతున్న అధికారులు, సర్పంచ్ ప్రసాద్ తదితరులు

కఠెవరం ముంపు ప్రాంతంలో నీరు తొలగింపు

తెనాలిరూరల్, సెప్టెంబరు 10: పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో మండలంలోని కఠెవరం పంచాయతీ పరిధిలోని అయ్యప్ప దేవాలయం శాంతినగర్ మధ్య కాలనీలో నిలిచి ఉన్న వర్షపునీటిని బయటకు పంపే సురక్షిత చర్యలు గ్రామ సర్పంచ్ బండికళ్లప్రసాద్, అధికార యంత్రాంగం చేపట్టింది. కాలనీ వర్షపు నీటితో నిండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన తక్షణమే స్పందించారు. నీళ్ల ఇంజన్ల సాయంతో నీటిని బయటకు పంపి శానిటేషన్ పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

భూస్వాముల ఆగడాలను ఎదుర్కొన్న ధైర్యశాలి ఐలమ్మ

● బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10: భూస్వాముల ఆగడాలను ఎదుర్కొని నిలబడిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. రజక చెరువు పార్కులో మంగళవారం ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ జయంతి పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆధిపత్యవాదంపై ఎక్కుపెట్టిన ఆయుధంగా నిలబడిందని, వివక్షపై వీరోచితంగా పోరాడిందన్నారు. నిజాం దొరల గుండెల్లో సునామీగా నిలిచిన వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజం కోసం ఉద్యమించాలన్నారు. పెసర్లంక రమణ, కుర్రా శ్రీను, మీరావలి తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

కోలాహలంగా గణనాథుల నిమజ్జనం



కొల్లిపరలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వినాయక స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

కొల్లిపర, సెప్టెంబరు 10: మండలంలో గత నాలుగు రోజులుగా వినాయక చవితి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. గురువారం వల్లభాపురం, మున్నంగి, తూములూరు, దావులూరు, అత్తోట, అత్తోటయాదవపాలెం గ్రామాల్లో గణనాథునికి అంగరంగ వైభవంగా భక్తులు పూజలు చేశారు. మండలంలోని తూములూరు, మున్నంగి, అత్తోట, కొల్లిపర తదితర గ్రామాల్లో కొంత మంది భక్తులు వినాయకుని విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఉంచి గ్రామాల్లో కనక తప్పెట్లు, బాణసంచా కాల్చుతూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 10: పొన్నూరు పట్టణంలోని 29వ వార్డులో చిన్న రామ మందిరం వద్ద ఏర్పాటుచేసిన గణనాథుడు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. చిన్న రామ మందిరం వద్ద ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపంలో గణనాథుడు నాలుగు రోజులు పాటు ప్రత్యేక పూజలు అందుకున్నారు. మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించిన గణనాథుని విగ్రహాన్ని సంప్రదాయ డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు ఏలూరి రామయ్య, పి.ఏడుకొండలు, చెన్నయ్య, అనీల్‌కుమార్, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 10: పొన్నూరు పట్టణంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన శ్రీసిద్ధి వినాయక యూత్ గణేష్ మండపాన్ని మంగళవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సందర్శించారు. నిర్వాహకులు తోట నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గణేష్ ఉత్సవాల సందరర్భంగా నిర్వాహకులు ఐదు వేల మందికి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్న ప్రసాదాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పంపిణీచేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అలాగే మండల పరిధిలోని పచ్చలతాడిపర్రులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు యలవర్తి శేషు, యంపరాల గోపి, మల్లంపాటి వాసు, పోతన నవీన్‌తేజ, వెంకట భూపాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నారాకోడూరులో...

చేబ్రోలు, సెప్టెంబరు 10: మండల పరిధిలోని నారాకోడూరులో ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడి నిమజ్జనం మంగళవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాల నుంచి గణనాథులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది సింహాసనంపై కూర్చున్న భంగిమలో వరాలు ఇచ్చే విఘ్న వినాయకుడిగా కొలువు తీరాడు. మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని సోమవారం రాత్రి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మంగళవారం ఉదయం చేబ్రోలు సమీపంలోని కొమ్మమూరి కాల్వలో గణనాథుని నిమజ్జనం జరిగింది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పొన్నూరు, నారాకోడూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

గంగానమ్మపేటలో అన్నదానం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 9: స్థానిక గంగానమ్మపేటలో మంగళవారం శ్రీగంగానమ్మతల్లి వినాయక ఉత్సవ కమిటీ అధ్యకుడు పెండేల సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 3000 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాకుమాను కనకరాం బాబు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు నిడమానూరి వెంకటరత్నం, తవ్వా నాగప్రసాద్, కౌన్సిలర్ తాడిబోయిన బకరహ్మేశ్వరరావు, మాదల కోటేశ్వరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, జాస్తి బుజ్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి మహేంద్ర కాలనీలో...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10: పట్టణంలోని 33వ వార్డులోని మహేంద్ర కాలనీలో హిందూ ముస్లిం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. నిమజ్జనం పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. 34వ వార్డులో కౌన్సిలర్ సంజీవరెడ్డి పూజలు నిర్వహించారు. పవన్‌సాయి, నరేంద్ర, వినోద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో పాల్గొన్న డీఎస్పీ

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్‌లో పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో డీఎస్పీ జనార్ధన్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహక కమిటీసభ్యులు డీఎస్పీని సాదరంగా ఆహ్వానించి స్వామి వారి దర్శనం అనంతరం దుశ్శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని డీఎస్పీ జనార్ధన్‌రావు ప్రారంభించారు. సుమారు 4వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మహేంద్రకాలనీలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు



గంగానమ్మపేటలో అన్నదానంలో పాల్గొన్న కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు



చవితి ఉత్సవాల్లో పాల్గొన్న డీఎస్పీ జనార్ధన్‌రావు, కమిటీ సభ్యులు

ఆకుకూరలు, తాజా పండ్లతో రక్తహీనత దూరం

● ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమాదేవి

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, మునగాకు వంటివి చేర్చుకోవడంతోపాటు తాజా పండ్లను తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగించవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని కొలకలూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మా కార్యక్రమంలో ఆమె పాల్గొని రక్తహీనత నివారణకు తీసుకోవల్సిన ఆహారంపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది సునీత, హిమబిందు, సరోజని తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత రైతులకు ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ అధికారులు

వరద బాధిత రైతులను ఆదుకోవడం మానవ ధర్మం

● సంగం డెయిరీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

కొల్లిపర, సెప్టెంబరు 10: వరద బాధిత రైతులను ఆదుకోవడం మానవ ధర్మమని సంగం డెయిరీ డైరెక్టర్ శాఖమూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు వరద బాధిత రైతులకు ఆయన డెయిరీ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సంఘ సభ్యులతో కలిసి ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదల కారణంగా పచ్చిగడ్డి కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి అండగా నిలిచేందుకు సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేయడం జరిగిందన్నారు. డెయిరీ మేనేజర్ ఆదినారాయణ మాట్లాడుతూ అన్నవరంలంక, కొత్తూరులంక గ్రామాల్లో ఇప్పటికే పశువుల దాణా ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు బొమ్ము వేమారెడ్డి, డెయిరీ అధికారులు గరికపాటి వెంకట్రావు, సందీప్ కృష్ణ, మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాసరెడ్డి, పాలసంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో జాబితా ప్రదర్శన

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: అధిక వర్షాలకు నష్టపోయిన పంటల తాలూకు ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలను సామాజిక తనిఖీ అనంతరం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రం) జాబితాను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు పరిశీలించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10: యడ్ల లింగయ్య కాలనీలోని ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరుణకుమారి, పుష్పరాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చేబ్రోలు, సెప్టెంబరు 10: మండల కేంద్రమైన చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మంగళవారం స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.15వేల విలువగలిగిన పుస్తకాలు, ఆట వస్తువులను ఎంఈవో రాయల సుబ్బారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివరామ్, కరిముల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ నిర్వాహకులు

వరద బాధితులకు ఈశా ఫౌండేషన్ చేయూత

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 10: వరద బాధితులకి ఈశా ఫౌండేషన్ చేయూత నిచ్చింది. స్థానిక టీజేపీఎస్ కళాశాల నుంచి వాహనాలను ఫౌండేషన్ సభ్యులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యావసరాలు 1100 ప్యాకెట్లను విజయవాడ వరద బాధితులకి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈశా ఫౌండేషన్ సేవా సంస్థలో భాగమైన ఈశా ఔట్‌రీచ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దాతల నుంచి సేకరించిన విరాళాల సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాజీ కౌన్సిలర్ నాగకోటేశ్వరరావుకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 10: కౌన్సిలర్‌గా, టీడీపీ నాయకుడిగా యరసాని నాగకోటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. 30వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ యరసాని నాగకోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగకోటేశ్వరరావు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాగకోటేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాజీ కౌన్సిలర్ నాగ కోటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

వరద బాధితులకు ఇన్నర్ వీల్ సాయం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 10: వరద బాధితులకు పొన్నూరు ఇన్నర్ వీల్ క్లబ్ చేయూతనందించింది. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతమోతు గ్రామంలో వరదల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న 30 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1000/- విలువగలిగిన బియ్యం, నిత్యావసరాల కిట్లను మంగళవారం పొన్నూరు ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు అందచేశారు. అలాగే రూ.50వేలు విలువ కలిగిన దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు కొత్తమాసు పద్మజ, బి.సెబలా, ఆలపాటి శారదా, రోటరీ అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్, కొత్తమాసు రామకృష్ణ, అంబటి వెంకటేశ్వరరావు, యాసం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితుల కుటుంబాలకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, స్వర్ణపురి కపుల్స్ సభ్యులు

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 10: వరద బాధితులకు పొన్నూరు స్వర్ణపూరి కపుల్స్ క్లబ్, బాపూజీ హిందీ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వెల్లటూరు కిష్కిందపాలెంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్, వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ భవిరిశెట్టి శ్రీదేవి, వాసవి మాజీ గవర్నర్ చీమకుర్తి నాగేంద్రరావు, బోలిశెట్టి రోశయ్య గుప్తా, కపుల్స్ కార్యదర్శి పోలిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆధార్‌కు రంగం సిద్ధం

- ప్రతి అన్నదాతకు ప్రత్యేక సంఖ్య కేటాయింపు
- డిజిటల్ కార్డుల జారీకి సన్నాహాలు
- సాగు వివరాలతో పాటు వ్యక్తిగత సమాచారం నిక్షిప్తం
- అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభంకానున్న ప్రక్రియ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 10: ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకు ప్రత్యేక కార్డులు జారీచేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయించి డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. వ్యవసాయరంగాన్ని డిజిటలైజ్ చేసే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయించి, కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లుచేసింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. రైతులకు ప్రత్యేక సంఖ్య ఆధారంగా కేటాయించే గుర్తింపుకార్డు ప్రాజెక్టును రాష్ట్రంలో అమలుచేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. రైతు ప్రయోజనాలు ముడిపడిన అంశం కావడంతో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వచ్చే ఏడాది మార్చి లోపు రైతుల వివరాలు సేకరించి, ఆ తదుపరి డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తారు. జిల్లాలో రూ.2లక్షల 56వేల మంది రైతులకు ప్రత్యేక ప్రయోజనం కలగనుంది.



ఆసుపత్రిలో శిరీషను పరామర్శిస్తున్న ధర్మారావు తదితరులు

దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, సెప్టెంబరు 10: కొల్లిపర మండలం మున్నంగిలో దళిత మహిళ శిరీషపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు దాడిచేసి గాయపరిచారని వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలు శిరీషను పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గ్రామంలో వినాయక నిమజ్జనం జరిగే సమయంలో శిరీష భర్తను ఐదుగురు వ్యక్తులు దుర్భాషలాడారన్నారు. వినాయక నిమజ్జనంలో పాల్గొనడం నేరమా అని ప్రశ్నించారు. అంతటితో ఆగక ఇంటికి వెళ్లి శిరీషపై దాడిచేశారని ఆరోపించారు. శిరీషను ఆమె భర్తను చంపుతామంటూ బెదిరించారని వారికి రక్షణ కల్పించాలని ధర్మారావు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బాధితుల తరపున ఉద్యమానికి పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కూచిపూడి కిరణ్, భరత్, ఇమ్మానుయేలు, చంటి, గోపి, సన్నీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో కొనసాగుతున్న విజ్ఞాన్ విద్యార్థుల సర్వే

గుంటూరు (విద్య), సెప్టెంబరు 10: విజయవాడలోని వరద ప్రాంతాల్లో వరుసగా నాలుగో రోజు వరద సహాయక సర్వేలో విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన 300మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఐదు గ్రూపులుగా విజయవాడ నగరంలోని వాంబేకాలనీ రోడ్, శాంతినగర్, డిస్నీలాండ్ రోడ్, పైపుల్ రోడ్, అజిత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలపై సర్వే నిర్వహించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో అప్డేట్ చేస్తున్నారన్నారు.